# వెడ్డింగ్ బెల్స్

పెరట్లో పాతిన మొక్క ఎదిగితే ఎగిరే మనసు, ఎదిగే ఆడపిల్లను చూసి జడుసుకుంటుంది.

తల తాకట్టు పెట్టయినా పాతికేళ్ళు పెంచిన కూతురికి పెళ్ళిచేసి పంపెయ్యాలనే ఆరాటం, బాధ్యత నిర్వర్తించాలనే తాపత్రయం, తప్పించి గుండెలమీద బరువు దించుకోవడానికి కాదు.

దాంతో వరాన్వేషణ ప్రారంభం. కులం, మతం, సాంప్రదాయం, అర్హతలు, ఉద్యోగాలు, పైరాబడులు వున్న వాడికి వున్నాయి. లేనివాడికి హోటు చేసుకుంటున్నాయి, పెళ్ళి సంబంధాల సంప్రదింపుల్లో.

పేరుకే దాత. కన్యాదాత. అన్నిటికీ దేవిరింపే. పెళ్ళిచూపులకి ఆహ్వానించడానికి వెళ్ళి "అయ్యా! మీ పెద్దబ్బాయి...." అని నోటిలో మాట నోటిలో ఉండగానే—

"పెళ్ళి కాలేదు. అమ్మాయికి చూస్తున్నాం. అమ్మాయికి కుదిరితే అబ్బాయిదేముందండి" అని తోసేసేవాళ్ళు కొందరైతే.

"అబ్బాయి! అప్పుడే పెళ్ళేమిటి నాన్నా" అంటున్నాడు. సంప్రదాయం చూసి మాలో హత్తుకుపోయే సంబంధం చెయ్యాలని నా ఆశ. చిన్నవాళ్ళు కదండీ. వాళ్ళు 'ఊ' అనే వరకు ఎదురుచూడాల్సిందే" అని మరికొందరు.

"అవునండి. అబ్బాయికి సంబంధాలు చూస్తున్నాం. ఏదీ ఒక్కటీ నచ్చడం లేదు. అబ్బాయికి పిల్లనచ్చితే...."

అబ్బాయి తండ్రి మాట విరుపుడు.

"నాపిల్ల అని చెప్పుకోవడం కాదు గాని అమ్మాయి...." అని ఆశతో అమ్మాయి తండ్రి నాన్పుడు.

"పిల్ల బావుంటుందని అంటున్నారు కనుక అమ్మాయి ఫోటో, జాతకం తీసుకుని రండి చూద్దాం."

ఎన్నో విన్నపాలకి మొదటి వరం.

ఇరవైనాలుగు గంటల్లో అడిగిన జాతకం, అమ్మాయి ఫోటోలనైతే యిచ్చుకోగలడు కాని యిరవై రోజులయినా అబ్బాయి తండ్రి దగ్గర నించి అమీతుమీ తేల్చుకోలేడు.

చివరకి ఫోటోని అమ్మాయి తండ్రికి తిరిగి యిస్తూ పిల్ల నాజూకుగా వుంటే పీలగా వుందని, అలా అని కాస్త ఆరోగ్యంగా, పుష్టిగా వుంటే అమ్మాయి కొంచెం లావుగా వుంది. మా వాడికి వరహీనంగా ఉంటుందని. ఈ రెండూ కాకపోతే 'జాతకం నప్పలేదనీ.'

పెళ్ళి కబురుకోసం ఆత్రంగా చూసే వాళ్ళకి చల్లగా అందే కబురు. మొదటి రెండింటిలో ఏదైనా అయితే సర్దిచెప్పుతాడేమో గాని మూడో మాటతో నోరు మూతపడిపోతుంది అమ్మాయి తండ్రికి.

మళ్ళీ పునఃప్రయత్నం.

ఫోటో, జాతకం యివ్వడం అయ్యింది.

పిల్లాడి తండ్రి చుట్టూరా చెయ్యాల్సిన ప్రదక్షిణాలు పూర్తయినాయి.

"జాతకం కుదిరింది. పిల్లా ఫర్వాలేదు అంటున్నారు మావాళ్ళు. కానీ వాడేమో ఉద్యోగం చేసే అమ్మాయినే చేసుకుంటానంటున్నాడు"అన్న అబ్బాయి తండ్రి మాట విని.

"ఉద్యోగం చేసే అమ్మాయి కావాలన్నప్పుడు ఉద్యోగం లేని మా అమ్మాయి ఫోటో, జాతకం ఎందుకు తీసుకున్నారని క్రాస్ ఎగ్జామిన్ చెయ్యలేదు. కారణం ఆడపిల్ల తండ్రి పిల్లనిచ్చుకోవడానికి వెళ్ళినవాడు, ఒదిగివుండాల్సిన వాడు. అందుకే అటు ఆడపిల్ల వాళ్ళకీ, యిటు మొగపిల్లవాడి వాళ్ళకి వారధుల్లాంటి మధ్యవర్తుల అవసరం ఎంతైనా వుంది.

అలాంటి వాళ్ళలో మా చుట్టు ప్రక్కలందరికీ సుపరిచితురాలు కడియాల కాంతమ్మగారు. ఆవిడ కదిలే మ్యారేజి బ్యూరో, ఆవిడ ఏ అడ్రసు రాసుకోదు. ఆ మాట కొస్తే రాసే పాటి చదువు ఆమెకి లేదు. పెళ్ళి కాని అబ్బాయిలు, అమ్మాయిల అందరి అడ్రస్సులేమిటి పెళ్ళి సంబంధాల సంధానంలో కావాల్సిన మేటరంతా ఆవిడ కంప్యూటరు బ్రెయిన్‌లో స్టోరై వుంటాయి.

ఉదయం లేచిన దగ్గర్నించి తిరిగిన కాలు తిరిగినట్లూ వాగే నోరు వాగుతున్నట్లే వుంటాయి. చెప్పే సంగతులు, వినే సంగతులు, ఆవిడకి అదే కాలక్షేపం. వయస్సు ఏడవ పదిలో పడుతున్నా ఆవిడంత ఆరోగ్యంగా వున్నారంటే కారణం ఆవిడ నిత్యం సలిపే ఆ దేహ పరిశ్రమేనేమో.

ఆవిడ పిల్లలందరూ ఎవరి బతుకులు వాళ్ళు బతుకుతున్నారు. ఎక్కేగుమ్మం, దిగే గుమ్మంగా తిరిగే తల్లిని చూసి "ఎందుకమ్మా! రామా! కృష్ణా అంటూ కూర్చోక నీకీ పాట్లు అని పిల్లలు అడిగితే "రామా కృష్ణా" అంటూ కూర్చుంటే ఉద్ధరణ నాకు మాత్రమే. మరిప్పుడో, ఎందరికో మాట సాయం చేస్తున్నాను. దానివల్ల ఎంతోమందికి పెళ్ళిళ్ళు జరిగి పిల్లాపాపలతో సుఖంగా వుంటున్నారంటుందామె.

అందుకే ఆవిడ మానాన ఆవిడని వదిలేశా



రు పిల్లలు. ఎవరింటికి వెళ్ళినా ఎప్పుడూ పచ్చి మంచినీళ్ళుతప్ప ఏమీ ముట్టదు.

ఆ రోజు కాంతమ్మగారు వెళ్ళే సరికి "రండి అత్తయ్యగారూ..." అంటూ పీట వేసింది వసుమతి.

"కూర్చోడానికి పీటలు వెయ్యడానికేం గాని, యింట్లో పెళ్ళిపీటలు వేస్తావా! లేదా! ఎదిగిన ఆడపిల్లని యింట్లో పెట్టుకొని కూర్చున్నావు. అమ్మాయి ఏం చదివిందేమిటి?"

"బి.కాం. పాసయిందండి"

"యికనేం. ఒకటో రకమైన సంబంధం వుంది. పాతూరి వారి అబ్బాయి. గవర్నమెంటు ఎరువుల ఫ్యాక్టరీలో ఉద్యోగం. ఏదో పెద్ద ఉద్యోగమే. పిల్లవాడు బుద్ధిమంతుడు."

ఉదయం వారపత్రిక

''ప్రయత్నించి చూద్దాం అత్తయ్యగారూ మగపెళ్ళివారు వస్తున్నారు. వెళ్తున్నారు. ఏ సంబంధానికి ఆ సంబంధమే అవుతుంది అనుకోవడం. వాళ్ల కోరికలు కొండెక్కి కూర్చొని కొన్ని, ఆశలు గొంతుముడి దిగక కొన్నీ జారిపోతున్నాయి''.. వసుమతి ఆవేదన.

* * *

కాంతమ్మగారిచ్చిన వివరాలతో వసుమతి భర్త రాఘవేంద్రరావు మాష్టారు వెళ్ళి పెళ్ళి కుమారుడ్ని పెళ్ళి చూపులకి ఆహ్వానించి రావడం జరిగింది.

...... ....... ......

గుమ్మం ముందు ఆటోరిక్షా ఆగిన చప్పుడు



వినేసరికి అంతవరకు నిర్వికారంగా కూర్చున్న శైలజ గుండెల్లో గుబులు ప్రారంభమైంది.

రాబోయే వరుడు ఎలా వుంటాడో అనే ప్రశ్న ఆమె నిలువ నీయలేదు. చివాలున లేచి కిటికీలోంచి తొంగిచూసింది.

అతను ఆటోలోంచి దిగి ఠీవీగా నిలబడ్డాడు. పెళ్ళికొడుకు ఠీవి అంటే అదేనేమో. అంత తక్కువ వ్యవధిలోనూ అందగాడే అనిపించిన శైలజకి కంటిలో నలుసులా మందువా లోగిలిలా వున్న అతని బట్టతల మీద నిలిచిన రెండు చెమట బిందువులు నీరెండలో తళుక్కుమన్నాయి.

అతనితోపాటే వెనక దిగిన ఆడమనిషిని చూడాలనిపించలేదు శైలజకి. అంతవరకు ఆలోచనలు ఒకరకం. ఆ తర్వాత మరోరకం.

పెళ్ళివార్ని సాగనంపి గదిలోకి వచ్చిన రాఘవేంద్రరావు మాష్టారికి ముడుచుకుపోయిన భార్యా, కూతుర్ల ముఖాలు చూసేసరికి ఉత్సాహం చచ్చిపోయింది.

ఈ సంబంధమూ చేజారిపోతున్నట్లేననిపించింది. భర్తని చూస్తూనే ఒంటికాలిమీద లేస్తూ—

''చూసి చూసి మాగొప్ప సంబంధం తెచ్చారు. ముసలావిడ కాంతమ్మగారు చెప్పిందనుకోండి. పెళ్ళికొడుకుని చూసినపుడు మీ యింగితమేమైంది?'' వసుమతి ఖస్సుమంది.

''వసూ! ఎందుకా తొందర. అమ్మాయి ఏమంటుందో?''

''ఏమంటుంది వద్దనే అంటుందనే వసుమతి మాటల్ని మధ్యలోనే త్రుంచేస్తూ.''

''అన్నీ నువ్వే అంటున్నావు. అమ్మాయిని చెప్పనీయి''

''ఆడపిల్ల అదేం చెపుతుంది. దాని తరపున నే చెప్తున్నాగా. వాళ్ళు ఏ కబురూ చెప్పే ముందే మనమే వద్దని చెప్తే గొడవ వదిలిపోతుంది.''

''అది కాదు వసూ''

''ఏమిటండీ, ఆస్తి అంతస్తూ వున్నాయని చూస్తూ చూస్తూ అమ్మాయిని ఆ అబ్బాయికి కట్టబెడతామా? యిడూ జోడూ ఉండక్కర్లా?''

''వసూ! నాదీ బట్టతలేగా!'' తల గోక్కుంటున్న రాఘవంద్రరావుగారితో ''అందుకేగా వద్దంటున్నది'' అని సంభాషణ మధ్యలోనే త్రుంచేసింది వసుమతి.

కన్నకూతుర్ని వంటరిగా కలిసికొని వప్పించే ధైర్యం మాష్టారికింక లేకపోయింది.

నాలుగు రోజుల తర్వాత వచ్చిన కాంతమ్మగార్ని చూస్తూనే వసుమతి ''రండి అత్తయ్యగారు, వాళ్ళకి చేరేశారా మా మాట''

''ఆ. అదెంత సేపూ. మీ మనస్సు మార్చుకుంటారేమోనని యింకా వెళ్ళలేదు.''

''ఆ సంబంధం వద్దండీ అత్తయ్యగారూ! అమ్మాయి కూడా అంత ఉత్సాహం చూపించడం లేదు''

''ఉత్సాహం లేనిది అమ్మాయికా? అమ్మాయి తల్లికా? పెద్దవాళ్ళం సర్ది చెప్పాల్సింది పోయి మనమే దిగలాగితే వాళ్ళదేముంది. కలలు కంటూనే వుంటారు. ప్రేమించిన రాకుమారుడు రెక్కలు కట్టుకుని వాల్తాడని, ఈ లోగా ఓ చెంప నెరుస్తుంది''

''అలాగని చెంప ఛెళ్ళుమనిపించి ఒప్పించలేం కదండీ''

''వాళ్ళ బావని కాదంది. సరేనన్నారు. మొన్న ఏలూరు సంబంధం సరే అబ్బాయి పీలగా ఉన్నాడు. దీన్నిలా తిరక్కొడితే ఎప్పటికి కుదురుతుంది. ఆలోచించవమ్మా. ఆ అబ్బాయికి బట్టతల అవుతోంది. నిజమే అది మినహా ఏ వంకా లేదు. అవునా. నీ పెళ్ళినాటికి మా రాఘవకి మాత్రం బట్టతల కాలేదా?

యిరుగు పొరుగు నవ్వుతారు. అదీ నిజమే. కలర్ టి.వి., కూలరు, కార్లమీద తిరిగే భోగం వీటన్నిటినీ మించి కట్టుకున్నదాన్ని నెత్తిన పెట్టుకునే మంచితనం ఉన్న కుర్రాడు. అప్పుడు ఈ నవ్వినవాళ్ళే కళ్ళల్లో నిప్పులోసుకుంటారు.

వ్వాళ్ళేమనుకుంటారో, వీళ్ళేమనుకుంటారోని. మనకి అన్ని విధాల అనుకూలంగా వున్న సంబంధం. నువ్వు ఊ అంటే అమ్మాయిని ఒప్పించవచ్చు.''

''సరే మీ అబ్బాయిగారు రానివ్వండి''

అంటున్న వసుమతి మాటల్లోని మార్పుని గమనించి ప్రక్క గదిలోంచి ఈ మాటలు వింటున్న రాఘవేంద్రరావు మాష్టారు ముందుకు వచ్చి.

''వెళ్ళు వసూ! వెళ్ళు మేడ మీద గదిలో అమ్మాయిదగ్గరకి వెళ్ళు'' మాష్టారులో చైతన్యం తిరిగి ప్రవేశించినట్లుగా వుంది. ఆ ఉత్సాహం, ఆయన వయస్సుని పదేళ్ళు తగ్గినట్లు చూపుల్లోనూ, నడకల్లోనూ మార్పు స్పష్టంగా కనపడుతోంది. భర్తలో వచ్చిన మార్పు క్రీగంట గమనిస్తూ మేడమీదకి వెళ్ళింది వసుమతి.

మాష్టారు కాంతమ్మ గారి దగ్గరికి చేరి ఆవిడ చేతులు పట్టుకుని ''పిన్నీ! అమ్మ చిన్ననాటి స్నేహితురాలైనందుకు, నాకు అమ్మలేని లోటు తీర్చావు. నీ రుణం ఎలా తీర్చుకోను?''

''పిచ్చి రాఘవా! యిందులో నాదేముందిరా. అర్థం చేసుకున్నది నీ భార్య, నేనందరికీ చేసినట్లే మాట సాయం చేసాను.''

నిజమే. పెళ్ళి సంబంధాల విషయంలో ఊగిసలాటలు తప్పవు. అదను చూసి ఓ ప్రక్కకి తూపే మధ్యవర్తి మంచిమాట అవసరం. అలా కాకపోతే కొమ్మెక్కి కూర్చునే వాళ్ళని కొమ్మనందుకోవాలనుకునే వాళ్ళని కలిపేదెవరూ?

కళ్యాణ ఘడియలు వచ్చి బాజాభజంత్రీలు మోగేదెప్పుడూ? ●

ఎ.రాజేశ్వరి